# అచలపతీ- అభౌతిక జీవులూ

ఫ్రెంచి విప్లవం మానవాళి వికాసానికి దోహదం చేసిన మాటనిజమే కానీ దానిలో కొన్ని పొరపాట్లు జరిగాయి. జమీందారన్న ప్రతివాణ్నీ గిల్లెటిన్ ఎక్కించడం వాటిలో ఒకటి. ఈసారి విప్లవం వస్తే నాటి జమీందార్ల గతి నేటి అత్తయ్యలకు పడుతుంది. వాళ్లు చలాయించే అధికారం భరించలేని మేనల్లుళ్లందరూ గిల్లెటిన్ దగ్గరకు తమ తమ అత్తలను గొర్రెల్లా తోలుకెళతారు. కానీ నేను మాత్రం ఫ్రెంచి విప్లవపు పొరపాటు రిపీటు చేయకుండా ఒక అత్తయ్యకు గిల్లెటిన్ను దూరం నుంచే చూపించి వదిలేస్తాను.

నా కైఫీయత్తుల్లో మా మాంకాళి అత్తయ్య గురించి చదివిన వాళ్లు 'నన్ను తిట్టడమే వ్యాపకంగా బతుకుతున్న ఆమె ఈ క్షమకు, దయకు పాత్రురాలా?' అని తప్పక సందేహపడతారు. వాళ్ళు తప్పులో కాలేస్తున్నారు. నేను క్షమించబోయేది మా ఉషా(ర)త్తయ్యను; మాంకాళి అత్తయ్య చెల్లెల్ని. అసలు పేరు ఉష అయినా సినారెలాగ అన్నిట్లో హుషారె కావడం వలన ఆవిడ 'ఉషా(ర)క్కయ్య లేదా ఉషా(రు)పిన్ని లేదా ఉషా(ర)త్తయ్యగా' పిలబడుతుంది. ఈ పిలిచే వాళ్ళంతా ఆమెకంటే చిన్నవాళ్ళేనని పిలుపుల వల్ల తెలుస్తోందిగా. ఆమెకంటే పెద్దవాళ్ల దృష్టిలో 'అది తింగరి బుచ్చి. దానికక్కర్లేని విషయం లేదు'. అలా పెద్దలనుంచి సేకరించిన అక్షింతలు నాబోటి పిన్నల కోసం మూటగట్టి ఉంచుతుంది ఉషారత్తయ్య.

అందుకే ఆ రోజు ఉదయం పదకొండు గంటలకు,"ఒరేయ్ బడుద్ధాయ్ నిద్రపోతున్నావా?" అని ఫోన్లో గొంతు వినబడగానే వెంటనే పోల్చుకున్నాను.

"అవును, గాఢ నిద్రలోనే ఉన్నాను.."

"ఏడిశావులే, జోకులేసేననుకోకు. నేనిక్కడ ఛస్తున్నాను. నా జీవన్మరణ సమస్యలన్నీ ఫోన్లో చెప్పేందుకు కుదరదు. మా ఊరి కొచ్చేయండి" అని చెప్పేసి ఫోన్ పెట్టేసింది.

ఏమి ధాష్టీకం! మేనల్లుడు మంచంమీదనుంచి కదిలే స్థితిలో ఉన్నాడో, లేదో

తెలుసుకోవాలన్న జిజ్ఞాసగానీ, వాడికేదైనా పనీ పాటా ఉందేమో, రాలేదేమో అడగాలన్న ధ్యాసగానీ, వచ్చేందుకు ఇబ్బంది లేదు కదాని మర్యాదగానైనా అనాలన్న ఇంగితంగానీ లేకుండా ఆర్డర్లిచ్చేసింది మహారాణి! లాభం లేదు, ఈవిడకు గిల్లెటిన్ క్లోజప్పులో చూపించాలి.

ఒక్కొప్పుడు సినిమాలో ఇద్దరు రామారావులూ, ముగ్గురు నాగేశ్వర్రావులూ ఉన్నా, సినిమా కెళ్లేదెందుకురా అంటే పావుగంటసేపు ఉండే రేలంగి హాస్యం కోసం. అలాగే మా అత్తయ్య పల్లెటూళ్లో ఇతరత్రా ఎన్ని హంగులున్నా, అజెండాలో అత్యంత ఆకర్షణీయమైన అంశం భీమారావు చేతి వంటలు తినగలగడం. అతను ఆకారంలో కాదు కానీ, పాకశాస్త్ర ప్రావీణ్యతలో సార్థకనామధేయుడే. పచ్చగడ్డితో పచ్చడి చేసిన ముసలమ్మలకు జాగీర్లిచ్చిన రాజులీ రోజుల్లో ఉండుంటే ఈపాటికి రెండు ఖండాలు అతని పేరు దఖలు పడి ఉండేవి.

అచలపతి నెల్లాళ్ల సెలవు మీద వెళ్లిన రెండోనాటికే ఈ ఆహ్వానం రావడం ఊరంతా కరంటుపోయినా జనరేటర్తో మన కోసం రేలంగి సినిమా చూపిస్తానన్నట్టుంది.

స్టేషనుకు, అత్తయ్యే స్వయంగా, ఒంటిరిగా వచ్చింది. "నీ అసిస్టెంటు అచలపతి రాలేదేం?" ఇదీ పలకరింపు ప్రశ్న!

"మేనకోడలి పెళ్లికని నెల్లాళ్ల సెలవు మీద వెళ్లాడు".

"ఆఁ! నెల్లాళ్ల సెలవా? ఎవణ్నడిగి ఇచ్చావురా? మా అందరికీ అతనితో పనులుండ వనుకొన్నావా? అతన్ని పంపేసి పిడత మొహం వేసుకొని నువ్వు ఒక్కడివే దిగబడ్డావా? నా జీవన్మరణ సమస్యకో పరిష్కారం చూపిస్తాడని అతన్ని రమ్మని, పోన్లే పసుపు విఘ్నేశ్వరుడిలా నిన్నూ తోడు రమ్మంటే చివరికి జరిగింది ఇదా! ఏ జన్మలో చేసిన పాపంరా దేవుడా ఇలాంటి మేనల్లుడ్ని అంటగట్టావు!?"

దేశంలో ఎంత్రప్రెనార్‌షిప్, అనగా ఔత్సాహిక వ్యవస్థాపకత ఎదగాలంటే లైసెన్సు నిబంధనలు ఎత్తేయడమే కాదు, ఇలాటి శల్యుల తిట్లపై రోళ్లతో కంట్రోళ్లు విధించాలి కూడా!

కారులో ఇంటికెళ్లే దారిలో చెప్పింది ఆవిడ సమస్య- భీమారావుకీ ఆమెకీ ఋణం తీరిపోతోందిట. ఎవరో పబ్లిషరొచ్చి అతన్ని ఎగరేసుకుపోతున్నాట్ట. సినిమా పొడుగు ఎక్కువైందన్చెప్పి పావుగంట రేలంగి హాస్యం తీసేసినట్టయిందనిపించింది

నాకు. తిరుగుర్రైలు రేపటిదాకా లేదంది.

కవితా సమావేశాలు ఏర్పాటు చేసేవాళ్ల అసలు ఉద్దేశ్యం ఇతరుల కవితలు తాము వినటం కంటే తమ కవితలు తక్కిన వాళ్లకు వినిపించటమేనని మీరనుకుంటే ఉషారత్తయ్యను చూసాక ఆ అభిప్రాయాన్ని బలపరుచుకొంటారు.

తన రచనలు అచ్చులో చూసుకోవాలని ఇతరులకు పంపి వాళ్లని హైరాణ పెట్టేకంటే తనే ఓ పేపరు పెట్టవచ్చు కదాన్న సదుద్దేశంతోనే స్త్రీల కోసం “పసుపు” అనే పత్రిక ఆరంభించింది అత్తయ్య. (యెల్లో జర్నలిజం అనే అర్థమొస్తుందని నేను చెప్పినా వినిపించుకోలేదు) తన కవితలు మాత్రమే వేస్తే బాగోదు కనక అవీ ఇవీ వేసేది. కానీ పాఠకులను చదివించగలిగేవి సేకరించడం దినదినానికీ కష్టమవుతూండంతో పద్మనాభరావు అనే బొంబాయి పబ్లిషరు ప్రచురించే ఇంగ్లీషు పత్రికతో టై-అప్ పెట్టుకొంటే మంచిదనిపించింది. విశ్రాంతి తీసుకోవడానికి రమ్మని పిలిచే మిష మీద ఆయన్ని పిలిచి భీమారావు వంటకాలతో మత్తెక్కించి, ఆయన పత్రికలలోని కొన్ని పాప్యులర్ శీర్షికలు అనువదించి తన పేపర్లో వేసుకొనేందుకు అనుమతి పత్రం మీద సంతకం పెట్టించాలని పెద్ద పథకం వేసిందత్తయ్య. అంతేకాదు, తన పత్రికకు ఫైనాన్సు కూడా కావాలిట. మావయ్య డబ్బులు విదిలింపు జోరు తగ్గిందట!

ఆహ్వానాన్ని మన్నించి పద్మనాభరావుగారు తన పడుచు లేడీ సెక్రటరీతో సహా దిగేడు; భీమారావు మాయలో పడ్డాడు. ‘తనను అతిథిగా పిలిచినవాడి ఇంటావిడపై ట్రాయ్ రాకుమారుడు కన్నేయగా లేనిది, వీళ్ల వంటాయన మీద మనం కన్నేస్తే తప్పేముంది?’ అనుకున్నాడేమో, భీమారావుని కాంట్రాక్టు ముగియగానే తనతో తీసుకుపోవడానికి పన్నాగం పన్నాడు పద్మనాభం- ఎక్కువ జీతం, సిటీలో జీవితం వంటి కలలు భీమారావుని ఊరించి సరేననిపించాయి.

“మీ మావయ్య ఊళ్లో లేరు. టై- అప్ మాట దేవుడెరుగు, భీమారావు వెళ్లిపోవడానికి కారణం నేనేనని తెలిస్తే వీపు చీరేస్తారు. అయినా నేను మాత్రం అతని చేతి వంట తినకుండా ఎలా బతగ్గలనురా? అందుకే భీమారావుని ఆపి ఉంచే ఉపాయం చెప్తాడని అచలపతిని వెంటబెట్టుకు రమ్మంటే నువ్వు తెలివితక్కువగా అతన్ని పంపించేశావ్” అంది అత్తయ్య దీనంగా.

నాకూ బాధ వేసింది- అత్తయ్య మీద కాదు, నా మీద నాకే. భీమారావు వంటలు

తినే యోగం జీవితంలో మళ్లీ రాదంటే జీవితమే వృథా అనిపించింది. “అత్తయ్యా నన్నేం చేయమంటావో చెప్పు నేను దేనికైనా రెడీ” అన్నాను నేపాళ మాంత్రికుడితో తోటరాముడిలా.

హఠాత్తుగా కారాపి, “ఒరే నాకో బ్రిలియంట్ అయిడియా వచ్చింది. వాడు మన బట్లర్ని కాజేద్దామని చూస్తున్నాడు కాబట్టి మనం వాడి సెక్రటరీని – ‘లిల్లీ లిల్లీ’ అంటూ ఎప్పుడూ పిలుస్తూనే ఉంటాడులే. స్వయంగా ఒక్క పని చేసుకోలేడు– వల్లో వేసుకోవాలి. దాన్ని తనకి తిరిగిచ్చేయమన్నాడనుకో, అప్పుడు మనం ‘మరి భీమారావుని ఒదిలేయ్’ అనొచ్చు. ఎలా ఉంది బేరం?” ఎలా ఉంది.., యమ్డన్గా ఉంది. అత్తయ్య ఫ్రెంచి వారికి సలహాలివ్వకపోవడం రాబర్టు క్లయివ్ అదృష్టం.

“అత్తయ్యా ... ఓ సందేహం..”

“ఏమిటి?”

‘‘ఈ లిల్లీ లందరూ సెక్రట్రీలవుతారా? లేక సెక్రట్రీలయ్యాక పేరు మార్చుకుంటారా?”



“ఒరేయ్..”

“ఉండుండు. ఈ లిల్లీని వల్లో వేయడం ఎలా? నువ్వు జీతం రెట్టింపు ఇస్తానంటావా?”

‘‘అందరూ డబ్బులకే లొంగర్రా. ఆడదాన్ని వలలో వేసుకోడానికి మగాడి ఆకర్షణ కావాలి. నువ్వు దాన్ని ఆకర్షించి ప్రేమలో పడేసుకో. తర్వాతి బేరసారాలు నేను చూసుకుంటాను”.

‘నేనా? ఆకర్షించాలా? నాకు మగాళ్లను ఆకట్టుకోవడం అంటే కొట్టిన పిండే కానీ ఆడాళ్లయితే కాస్త రవ్వ..”.

“నీకేంరా?    నీకు కాలొంకరా? కన్నొంకరా? ఆ దాక మొహానికి నీ పిడత.. అదే, నీ మొహం చాల్లే..”

నీ పెళ్లి నా మొహంలా ఉంది. నా పెళ్లికి వచ్చి కాగడా వెయ్యమన్నాట్ట వెనకటికి మా అత్తయ్య పూర్వీకుడు. నా చేత పనిచేయించుకొనే విధానమా ఇది? బొత్తిగా మాట చాతుర్యం లేని మనిషి, ఆవిడే నెపోలియన్ అయివుంటే, తన సైన్యంతో ‘మీరసలే చలికి ఆగలేని అర్భకులు... సరే సరే వెళ్ళి రష్యా మీదికి దండెత్తి వీలుపడితే వెనక్కి రండి’ అని ఉండేది.



నాది పిడత మొహం కానట్టే , లిల్లిది దాక మొహం కాదు. ఒంపూ,సొంపూ, కండా, గిండా –మంచి జబర్దస్తీగా ఉంది. నాకు డిటెక్టివ్ నవలలు ఇష్టమని తెలియగానే దగ్గరిసా జరిగి, తనూ ఒకప్పుడు అవి చదివేదానివనీ తర్వాత, భౌతిక జీవాలైన అపరాధ పరిశోధకుల చర్యల కంటె అభౌతిక జీవాలైన దయ్యాల చేష్టలు ఉత్సాహభరితంగా, ఉత్తేజపూరకంగా ఉంటాయని తెలుసుకొని హారర్ పుస్తకాలు చదువుతున్నాననీ చెప్పింది. ‘దయ్యాలు ఉన్నవా? లేవా?’ అనే పుస్తకం రాసే ప్రయత్నంలో పరిశోధనలు చేస్తున్నాడని కూడా చెప్పింది.

‘దయ్యాలు ఉన్నవా? లేవా?’ అన్న ప్రశ్న మనకెందుకో నా కర్థం కాదు. ఉండి ఉద్ధరించేదేముంది? (చెట్టు తొర్రలో కాసుల మూట ఆచూకీ చెప్పే దయ్యాలు చందమామ కథల్లో మాత్రమే ఉంటాయి). ఒక వేళ ఉన్నా వాటి ఉనికి మనకి తెలియకూడదని

అని అనుకున్నప్పుడు మనంమేం చేయగలుగుతాం? కనబడకపోవడం వాటి సహజలక్షణమనుకోండి. మీకోసం ఆ లక్షణాన్ని అవి మార్చుకోగలవా? కనబడో, బడకో వాటి మానాన వాటిని బతకనివ్వకూడదా? మనిషికున్న ఈ కుతూహలమే అతడికొంప ముంచుతుంది. అరేబియన్‌నైట్స్ కథల్లో చూడండి 'రాకుమారా! ఈ గదిలో ఉన్నమాట నూటఏభైఎనిమిది తలుపులూ నీవు తెరవవచ్చు – నూట నలభైరెండవది తప్పు' అంటే లెక్కపెట్టుకుని సరిగ్గా ఆ నూట నలభై రెండవ తలుపే ముందుగా తెరిచి శిలావిగ్రహమై కూచుంటాడు. పాఠకులు నీతులు నేర్చుకోకపోతే, నా బోటివాళ్లు కథలు రాసి ప్రయోజనం ఏవిటి?

పోనీ దయ్యాలున్నాయనే నువ్వు నమ్మావయ్యా, నిక్షేపంలా నమ్ము. తక్కిన వాళ్లని నమ్మించడానికి ప్రయత్నాలెందుకు? దాని కోసం ఋజువులూ, సాక్ష్యాలు సేకరించడం ఎందుకు? 'నమ్మేవాడికి ఏ ఋజువులూ అక్కర్లేదు, నమ్మని వాడికి ఏ ఋజువూ చాలదు' అనేవాడు మా తాతయ్య. ఓసారి ఓ కార్టూన్ చూసా. రెండు దయ్యాలు మూడో దయ్యం గురించి ముచ్చటించుకుంటూంటాయి – 'వాడెప్పుడూ ఇంతే. మనిషిగా ఉండేటప్పుడు దయ్యాల్లేవనేవాడు. ఇప్పుడు మనుషుల్లేరంటున్నాడు.' అని. నీతి ఏమనగా – ఎన్ని పుస్తకాలురాసినా, నాలాటివాళ్లను ఎంత ఇబ్బంది పెట్టినా నమ్మనివాడు నమ్మడుగాక నమ్మడు.

ఇవన్నీ లిల్లీ పుస్తకం గురించి చెప్పగానే ఆమెను వారిస్తూ చెప్పిన హితోక్తులు అని మీరనుకుంటే పొరబడినట్లే. లిల్లీని బుట్టలో పెట్టడానికి అత్తయ్య ఏర్పాటు చేసిన భూతగృహానికి అమావాస్యనాడు అర్థరాత్రి చీకట్లో, తుప్పల్లో, డొంకల్లో, ముళ్లదారిలో, మట్టిబాటలో – లిల్లీని వెంటబెట్టుకుని వెళ్లేటప్పుడు కదలిన, చల్లగాలితో బాటు వీచిన భావవీచికలివి.

నేనసలు లిల్లీ పుస్తకం విషయం అత్తయ్యకు చెప్పకుండా ఉండాల్సింది. అది విని ఆవిడ ఎగిరి గంతేసి తనకు తెలిసిన నాటక సమాజం ద్వారా భూతగృహాన్ని, స్పెషల్ ఎఫెక్ట్సనీ ఏర్పాటు చేస్తానన్నప్పుడు 'భలే అయిడియా' అని అనకుండా ఉండాల్సింది. భూతాలచేష్టలకు లిల్లీ భయపడినప్పుడు ఆమె వెన్నుదట్టి, వీపు నిమిరి, అక్కున చేర్చుకొని హీరోయిజం ప్రదర్శించాలని అత్తయ్య సూచించినప్పుడు తల ఊపకుండా మెడ దగ్గర కీలుకి వాత పెట్టుకోవాల్సింది.

అత్తయ్య దగ్గిర మొహమాటపడినా "ఈ పల్లెటూరి శివారులో ఒక పాడుపడిన

భవంతిలో నాలుగైదు దయ్యాలు తిరుగుతాయనీ, పాటలు పాడతాయనీ, మనం అడిగిన ప్రశ్నలకు జవాబు చెబుతాయనీ మీ అత్తయ్య పనిమనిషి చెప్పింది. మనం ఈ అమావాస్య నాడు వెళ్లి చూద్దామా?" అని లిల్లీ అడిగినప్పుడు "మీకు దయ్యాల్ని చూపించడం కంటె నా జీవితానికి వేరే లక్ష్యం ఏముంది?"అని అనకుండా ఉండాల్సింది.

హారర్ సినిమాల ఎఫెక్ట్ తీసుకురావటానికి అత్తయ్య ఆ భవంతికి కిలోమీటరు దూరంలో కారు ఆగిపోయేటట్టు పెట్రోలు పోయించింది. రోడ్లో మేకులు పాతించి టైరు పంచరు చేయించింది. కీచురాళ్ల రొదలు, కప్పల బెకబెకలు రికార్డు చేయించి, మాకు వందగజాల దూరంలో సైకిలు మీద ఓ కుర్రాడు టేప్ రికార్డుతో వచ్చే ఏర్పాటు చేసింది.

భవంతి దగ్గర ఏర్పాటు కూడా పకడ్బందీగా ఉంది. ఊరంత తోట, జుట్టు విరబోసుకున్న చెట్లు, భారీ తలుపులు తెరిచి ఉండడం, కరెంటు లేకపోవడం, నల్లపిల్లి, గబ్బిలాలు – వేటికీ లోటు లేదు.

లిల్లీ సంచిలోంచి బారెడంత బాటరీ లైటు తీసి అటూ యిటూ కలియదిప్పుతూ 'ఏవీ? దయ్యాలేవీ?' అంది . "లైటుండగా దయ్యాలు రావడం ఎప్పుడైనా చూశావా?" అని నిర్మొహమాటంగా, సూటిగా అడిగేశాను. "ఓ, నా చేతిలోంచి బాటరీ లైటు జారిపడి పోతేగానీ దయ్యాలు రావు గాబోసు" అంటూ టార్చి క్రిందపడేసి దొర్లించింది.

ఓ రెండు నిమిషాలకు 'నిను వీడని నీడను నేనే' ట్యూన్ వినబడసాగింది. లిల్లీ 'అంతస్తులు' సినిమా చూడలేదులా ఉంది– "దగ్గర్లో సినిమా హాలేమైనా ఉందా? మ్యూజిక్ వస్తోంది" అంది.

లిల్లీ తప్పేమీ లేదు. నాగిన్ మ్యూజిక్ బాక్‌గ్రౌండ్‌లో వినపడితేనే సినిమా తెర మీద పాముని గుర్తు పట్టగలం. లేకపోతే తాడో పేడో అనుకుంటాం. సౌండ్ ఎఫెక్ట్స్ విభాగంవారు కూడా ఈ విషయం గ్రహించేరు కాబోలు. లిల్లీ హిందీ సినిమాలు చూసుండవచ్చనే అంచనాతో 'నీల్ కమల్'లో "తుఝ్‌కో పుకారే" ట్యూన్ వాయించారు. లిల్లీ వెంటనే గుర్తుపట్టింది. "దెయ్యాలు వస్తున్నాయి"అంది ఉత్సాహంగా.

దెయ్యాలు తెల్లచీరలు ధరించి ఒక్కక్షణం మా దగ్గరగా, మరొక క్షణం ఆమడ దూరంలో కనబడుతూ వికటాట్టహాసాలు చేస్తూ రంగప్రవేశం చేశాయి. కాన్ఫరెన్సుకి రెడీ అయ్యాయి.

దెయ్యాలతో ఇంటర్వ్యూలో లిల్లీ మొదటిప్రశ్న –“మీరెప్పుడూ తెల్లచీరలే కడతారేం?”

దయ్యం జవాబు (రిసౌండ్ ఎఫెక్టుతో) “లేకపోతే మీరు గుర్తుపట్టలేరని”.

రెండవ ప్రశ్న – “బతికుండగా ఏ ఘనకార్యాలూ చేయలేని మీరు దయ్యాలయ్యాక ఏ శక్తి సహాయంతో అద్భుత కార్యాలు చేయగలుగుతున్నారు?”

జవాబు– “మీ ఊహాశక్తి”

ప్రశ్న : “ఏదైనా ప్రళయం వచ్చి మీ జాతి అంతరిస్తే ?... భగవంతుడికి దయకలిగి మీ అందరికీ ముక్తి కలిగిస్తే?”

జవాబు: “మీ రచయితలూ, సినీ నిర్మాతలూ మా జాతి అంతరించకుండా చూస్తారు”.

లిల్లీకి ఉత్సాహం పెరిగి దెయ్యాల జీవితగాథలు అడగడం మొదలుపెట్టింది. ఒక్కొక్క దెయ్యం ఒక్కొక్క కథ వినిపిస్తోంది, తగిన నేపథ్య సంగీతంతో సహా! ఒక కథను లిల్లీ గుర్తుపట్టేసింది –

“ఇది ‘పురానా మందిర్ ’ సినిమా కథలా ఉందే” అంది. సమయస్ఫూర్తిగల ఆ దెయ్యం వెంటనే “అవును ఆ చిత్రనిర్మాత కూడా ఇలాగే వచ్చినా కథడిగి దరిమిలా సినిమా తీశాడు” అంది. ఆ తర్వాత చెప్పినవాళ్లందరూ తెలుగు సినిమా కథలే చెప్పేరు.

ఒళ్లు గగుర్పాటు కలిగించే కథాఘట్టాలు, నేపథ్య సంగీతం, వాతావరణం– అన్నీ సమకూర్చినా లిల్లీ భయపడటమే లేదు. ధైర్యం చెబుతూ, పొదివి పట్టుకొని శిరస్సు మూర్కొనే అవకాశం నాకు ఇవ్వలేదు. ఇక హీరోయిజమ్ చూపించే ఛాన్సు నాకెక్కడిది? భూతగృహ సూత్రధారి కూడా ఈ విషయం గ్రహించినట్టున్నాడు. హఠాత్తుగా సౌండ్స్ పెంచేసాడు. గబ్బిలాల్ని గురి చూసి విసర సాగేడు. పిల్లిని మా మీదికి ఉసిగొల్పాడు. ఒక గబ్బిలం వెనకనుంచి హఠాత్తుగా నా వీపు మీద వచ్చి తగలడంతో వెర్రి భయం వేసి పిచ్చికేక పెట్టి మూర్ఛపోయేను.

స్పృహ తప్పి తర్వాతి సీనులో కళ్లు తెరిచిన వాళ్లకు రెండు ఛాయిస్‌లు ఉంటాయి – ‘నేనిక్కడికెలా వచ్చేను? మీరెవరు?’ అని అనటం ఒకటి! గత స్మృతులన్నీ మరచి రక్షించిన అమ్మాయిని ప్రేమించదలచుకొంటే, ‘నేనెవరు? ఎక్కడున్నాను?’ అని అడగడం మరోటి. కానీ అత్తలున్న దురదృష్టవంతులకు ఈ రెండు ఛాయిస్‌లూ ఉండవు.

నేను కళ్లు తెరిచి, నోరు విప్పేలోగానే “లేచావూ!? అలాగే కునికేస్తావేమో

ననుకొన్నాను. అయినా ఆ పిలకజడ పిల్లను వలచి, వలలో వేసుకోవడం రాని వాజమ్మవేంటిరా నువ్వు? (ఈ వలల గోలేమిటో – అత్తయ్య క్రితం జన్మలో జాలరిణి అయ్యుంటుంది. పోట్లాడే స్వభావం కూడా ఆ బాపతే). దాన్ని అదరగొట్టి ఓ పట్టు పట్టరా అంటే నువ్వే బెదిరిపోయి కీళ్లు పట్టుదప్పి కూలబడిపోయావేమిటి? నీకు చిన్నప్పట్నించీ భయం జాస్తి. ప్రైమరీ స్కూల్లో లెక్కల టీచరంటే భయం, ఇన్నేళ్లొచ్చినా పోలీసులంటే భయం, ఊరకుక్కలంటే భయం. దాన్ని చూడు , ధైర్యం తెచ్చుకో. దయ్యాలున్నాయా లేవా? అంటూ రీసెర్చెందుకు, అదే పెద్ద దయ్యమైతేను... నిన్ను భుజాన వేసుకొని అంత దూరం నడిచొచ్చింది. దాన్ని ఆకట్టుకోమని అడగవలసింది నిన్నా!? చాల్లే! సాయంత్రం మీ ఊరికి బండెక్కు. భీమారావు వంటలు తిని తెగ బలిసావు" అన్న అత్తయ్య అష్టోత్తరం వినబడింది.

సిగ్గుతో చచ్చిపోవడమంటే ఏమిటో అనుభవపూర్వకంగా తెలిసింది. అలా చచ్చిపోయేలా వుండగా కాస్సేపటికి ఒక చల్లని అరచెయ్యి నుదురు రాసింది. కాస్సేపటికి అరచెయ్యి నా తల వెనక్కాల చేరి తలను పైకెత్తి ఆ చేతుల తాలూకు శాల్తీ ఛాతీకి అదిమింది. కళ్లు తెరవబోయాను. తలెత్తి చూడబోయాను. వేరొక చెయ్యి నా వీపు నిమురుతోంది. "నా పిచ్చికన్నా! భయపడ్డావా? అండ నేనుండగా నీకెందుకు భయం? ఇద్దరం కలిసి కొండల్ని పిండిచేద్దాం" అంటోంది గొంతు– లిల్లీతాలూకుది – నేనే కొండల మధ్య పిండి అయిపోతున్నానన్న విషయం గ్రహించటం లేదు వెర్రిది!

'ఆడదాన్ని , అద్వైతాన్నీ అర్థం చేసుకోవడం కష్టం' అన్నారు వైష్ణవులైన సముద్రాల వారు కీచకంగారావు నోట. 'ఆడది మగవాడి బలహీనతలు ప్రేమించినంతగా ప్లస్ పాయింట్లను ప్రేమించదు' అన్నాడు గొల్లపూడి అకాశంలో పిడికెడు మారుతీరావుగారు. ఏవైనా లోపాలున్న మొగాణ్ని చేసుకుని వాటిని సరిదిద్దితే ఏదో సాధించానన్న తృప్తి ఆమెకు కలుగుతుంది కానీ సర్వసల్లక్షణాలతో విలసిల్లే మగాడివల్ల ఆ తృప్తేది?

అందుకేలాగుంది లిల్లీ నన్ను ప్రేమించింది. నన్నొక ధీరుడిలా చేసే యజ్ఞం తాను చేపడతానన్నది. వెంటనే ఈ విషయం అత్తయ్యను పిలిచి చెప్పా. "ఇదీ విషయం, సాయంత్రం బండి కెళ్లి పోమంటావా? నిదానించి చెప్పు" అన్నాను విలాసంగా కాలు వూపుతూ.

"ఆ దాకమొహందాని తలకాయ చిల్లిదాకలా ఉండుంటుంది. బుద్ధి ఎక్కడో జారిపడిపోయుంటుంది. నిన్ను ధీరుడిగా చేస్తుందా? చిన్నప్పట్నుంచీ మేమంతా

తంటాలు పడ్డా చేయలేని  పని అది చేయగలననుకుంటోంది. ఓ నాలుగురోజుల్లో చప్పబడి పోతుందిలే. నీ టికెట్టు వచ్చేవారానికి వాయిదా వేయిస్తాను" అంది అత్తయ్య ఏ మాత్రం గిల్ట్ ఫీలింగ్ కనబరచకుండా. లాభం లేదు, ఈవిడని  గిల్లెటిన్ మీద కాస్సేపు  పడుక్కో బెట్టి  హడలగొట్టాల్సిందే.

నాలుగు రోజులు వనవిహారాలు, పధ్నాలుగు గాఢాలింగనాల వల్ల  మెత్తబడ్డట్టు నటించి ఓ రోజు అడిగేశా – "నీ ఉద్యోగానికి రాజీనామా యిచ్చేసి  నాతో మా ఊరు వచ్చేసి  పెళ్లి చేసుకుంటావా?"అని.

"ఓ.. దివ్యంగా" అంది ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా.

తురుపు ముక్క చేతికొచ్చిందని అత్తయ్యకు చెప్పా.  త్వమేవాహం అర్థమయ్యిందన్న పాఠకుడికేసి ఆరుద్రలా  అపనమ్మకం, ఆశ్చర్యం, ఆనందం, సంభ్రమం మేళవించి నాకేసి  చూసింది. "నిన్ననే అడిగాడు పద్మనాభం గాడు.  మీరడిగినవి చేయాలంటే మీరు నాకో  ఉపకారం చేయాలంటూ! ఏమడుగుతాడో నాకు తెలుసు.  అందుకే సంభాషణ  తుంచేసి వచ్చేశాను.  ఇవాళే  నీవీ వార్త అందించావు.  దేవుడెంత గొప్పవాడో చూడు.  ఇంత సృష్టిలో  పనికిమాలిన వస్తువు అనేది లేకుండా సృజించాడు. మనం తెలుసుకోలేక 'ఫలానావాడిది దండగ బతుకురా' అంటాం. వాడే  ఇంకొకరి కంటికి నదురుగా అనిపిస్తాడు. అదే వాడి లీల!"

అత్తయ్య చిన్నప్పుడు నాటకాల్లో వేసేదేమో, స్వగతాలు కూడా ప్రకాశముగా  చెప్పేస్తోంది – అదీ నా ఎదురుగానే! ఆపుదామని  చూస్తే ఆగే ధోరణి లేదు.

"రానీ పద్మనాభంగాణ్ని..  'బట్లర్  కావాల్బోయ్, నీ సెక్రటరీని  ఎగరేసుకు పోతాను చూడు' అంటాను.  దెబ్బకి ఫైనాన్సూ, బట్లరూ రెండూ  దక్కుతాయి – లేక  రెండూ దక్కుతారు ..లేక దక్కుతుంది, దక్కుతాడు"  ఆనందాతిరేకంతో అత్తయ్య మాటలు తడబడుతున్నాయి.

కానీ సాయంత్రం కనబడేసరికి తడబాటు ఇంకోలా ఉంది. "యింది, పోయింది, అయిపోయింది, అంతా అయిపోయింది. చేజారింది.., చేజారాడు. భీమారావు చేజారిపోయాడు" అంటూ కూలబడిపోయింది రుక్మిణీహరణం  కళ్లారా  చూసొచ్చిన శిశుపాలుడిలా.

"మరి తురుపు ముక్క యేం చేసావు?" అడిగాను, నాగాస్త్రం  ఇంట్లో  మర్చిపోయి వచ్చిన కర్ణుడిని  దుర్యోధనుడు చివాట్లేసినట్టు.

"నా బొందతురుపు! లిల్లీ వాడి సెక్రటరీ కాదుట. కూతురిలా చూసుకొంటున్నాడట – కాదు కాదు – కూతురేట. దీని తల్లిని పెళ్లాంలా చూసుకొంటున్నాడట. నా తలకాయ! వాడు చెప్పినట్టే నేనూ చెప్పాలనేవుంది? ఒరేయ్, ఇది వాడు ఉంచుకున్నదాని కూతురు. పెళ్లానికి తెలియకూడదని సెక్రటరీ ఉద్యోగం అన్న పేరుతో డబ్బిచ్చి పోషిస్తున్నాడు".

"నేనమ్మను. సెక్రటరీ కాకపోతే లిల్లీ అన్న పేరెలా ఉంటుంది?"

"నేనూ అదే అడిగాను... దాని పేరు లిల్లీ కాదుట. లల్లేట. పూర్తి పేరు లలిత ట. లల్లీ, లల్లీ అంటే మనం లిల్లీ అనుకొన్నాం. ఇంతకీ చెప్పేది విను. దీన్ని ఎవడు పెళ్లి చేసుకుంటాడాని చూస్తున్నాడు వాడు. మనం చేసుకుంటా మనగానే 'హమ్మయ్య వెంటనే తీసుకుపోండి' అంటున్నాడు".

అత్తయ్యది భీమారావు సమస్య ఒకటే అయితే నావి రెండు. లిల్లీని పెళ్లి చేసుకోవటం రెండింట్లో పెద్ద సమస్య. ఇంకేం చేస్తాను! అచలవతి మేనకోడలు ఇంటికి ఫోన్ చేశాను. అత్తయ్య 'ఒరే బడుద్ధాయ్' ఫోన్ దగ్గర్నుంచి శిశుపాలుడి విషాదం దాకా ఏకరువు పెట్టి 'ఏవంటావ'న్నాను.

ఫోన్లో మెత్తటి దగ్గు, తర్వాత మాటలు. 'ఇప్పుడు రెండు మార్గాలు కనబడుతున్నాయి సర్. మొదటి మార్గం భీమారావును అరణంగా



తెచ్చుకునే షరతుపై ఆ స్త్రీ బలమైన బాహువుల్లో ఇమిడి, శేష జీవితాన్ని గడపడం. మార్గాంతరం ఏ బల్లినో బొద్దింకనో చూపి ఆమెను దడిపించి మీరే ఆమెను బాహువుల్లో ఇముడ్చుకోవడం".

"మార్గాంతరతరతరం ఏదన్నా ఉందా? అంటే ఎవరి బాహువుల్లోనూ మరొకర్ని ఇముడ్చుకోకుండా వారివారి బాహువులను చివరి ఊపిరి వరకూ ఖాళీగా ఉంచుకునే పథకం మీ పరిశీలనలో ఉన్నదేమో నాకు తెలియపరిచే అవకాశం ఉందా?" అతన్ని వెక్కిరిస్తూ అడిగేను.

అతను నొచ్చుకొని ఉంటే ఆ విషయం తెలియరానీయ లేదు. ఎప్పటిలాగే వినయంగా "ఆమెతో పెళ్లి తప్పించుకొనడమే మీ కార్యక్రమంలో మొదటి అంశంగా నాకు తోస్తోంది సర్. మీ అత్తయ్యగారి నడిగి ఆ భూతగృహం కాంట్రాక్టర్ ఫోన్ నెంబర్ నాకివ్వగలరా సర్?"

రెండ్రోజుల తర్వాత లిల్లీ వచ్చి "ఈ రోజు దయ్యాల పండగట. ఆ దెయ్యాల కొంపలో కుప్పలు తిప్పలుగా దయ్యాలు వస్తాయని మీ అత్తయ్యగారు చెప్పారు. నువ్వూ వస్తావా డార్లింగ్? పోనీ వద్దులే... నే నొక్కత్తినే వెళ్లొచ్చి వివరాలు చెప్తాను సరేనా?"అని బుగ్గ మీద చిటికేసి వెళ్లిపోయింది.

అర్ధరాత్రి దాటాక తలుపు దబదబ మోగింది. ఎవరాని చూస్తే లిల్లీ.

"యు బ్రూట్! నీ సంగతంతా తెలిసింది" అని అరిచింది. "నీ మొదటి భార్య దెయ్యం కనబడింది. నీ కథంతా చెప్పేసింది".

"నా మొదటి భార్యా !?" నిద్రమత్తులో సరిగ్గా వినబడలేదేమోనని రెట్టించి అడిగేను.

"అవును. నువ్వు విషంపెట్టి చంపించేసిన నీ మొదటి భార్య దయ్యమై తిరుగుతోంది".

"విషమా!? భార్యకా?" మత్తు సరిగ్గా దిగనట్టుగా ఉంది.

"అవును విషమే, భీమారావు సహాయంతో రోజూ ఆమె ఆహారంలో ఆర్సెనిక్ కొద్ది కొద్దిగా పెట్టించి నువ్వు పొట్టన బెట్టుకున్న నీ భార్య.." వత్తి పలుకుతూ అంది.

"పొట్టలోనా!?" పొట్ట తడిమి చూసుకొన్నాను.

"రాస్కెల్ . ఏమీ౯ తెలియనట్టుగా నటిస్తూన్నావు కదూ! 'నా భార్యను చంపడానికి బలమైన కారణాలు ఇవి' అని నువ్వు నిజం ఒప్పుకొని ఉంటే క్షమించి ప్రేమను కంటిన్యూ చేసేదాన్ని. నీ బుకాయింపు మరింత అసహ్యం కలిగిస్తోంది. నువ్వూ వద్దు, నీ సహాయకుడూ భీమారావూ వద్దు. డాడీతో ఇప్పుడే చెప్పేస్తాను" అంటూ

చ(రున వెళ్లిపోయింది.

రైలెక్కిస్తూ అత్తయ్య అంది. "పేపరుకు మేటరూ, ఫైనాన్సు దొరకలేదన్న కొద్దిపాటి చింతే కాని భీమారావు నాకు దక్కాడ్రా! అచలపతికిన్ని అయిడియాలు ఎక్కణ్నించి వస్తాయిరా? ఏం తింటాడో కనుక్కో"

ఇన్ని అవస్థలు పడ్డ నాకు థాంక్స్ చెప్పాలన్న ఆలోచన ఉషారత్తయ్యకు ఎందుకు రాలేదో? ఎంతైనా అత్తయ్య బుద్ధి పోనిచ్చుకొంది కాదు. గిలెటిన్ ఎక్కించేస్తేనే మంచిదేమో!

